# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 08-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రభుత్వ సేవలను వేగంగా అందించడంలో ఫైళ్ల పరిష్కారం కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

**2. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

**3. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు జూన్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ వెల్లడించారు.**

**4. ప్రపంచ తలసేమియా వ్యాధి అవగాహన దినాన్ని ఈరోజు పాటిస్తున్నారు.**

==========================

ప్రభుత్వ సేవలను వేగంగా అందించడంలో ఫైళ్ల పరిష్కారం కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న రెండవ రోజు కలెక్టర్ల సదస్సులో ఫైళ్ల క్లియరెన్స్, డేటా లేక్ అంశాలపై ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి మండల స్థాయి వరకు ఫైళ్ల పరిష్కారంలో వేగం పెంచాలని, ఈ-ఫైలింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కలెక్టర్లు కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచిస్తూ..

వాయిస్ 30 సెకన్లు

-------------------------

తిరుపతిలో జరుగుతున్న తాతయ్యగుంట గంగమ్మ జాతరలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ రోజు పాల్గొన్నారు. గంగమ్మ ఆలయంకు చేరుకున్న మంత్రి, జాతర సందర్భంగా అమ్మవారికి సారెను సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తోందని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా తిరుపతి గంగమ్మ జాతర నిలుస్తోందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ అన్ని సౌకర్యాలు కల్పించిందని మంత్రి తెలిపారు.

-------------------------

ప్రజలకు ఇచ్చిన సంక్షేమ హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన "ప్రజా దర్బార్ "కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ,

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ నగరంలో డ్రైనేజీ ఇబ్బందులు, కొండ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వాటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని శివనాథ్ తెలిపారు.

---------------------------

రాష్ట్ర రవాణా రంగానికి కీలకమైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు జూన్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నట్లు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. రైల్వే జోన్‌కు గెజిట్ నోటిఫికేషన్ రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. రైల్వే జోన్‌తో పాటు విశాఖ డివిజన్ ఏర్పాటు కూడా రాష్ట్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతోందని శ్రీ భరత్ తెలియజేస్తూ...

వాయిస్ 26 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఈరోజు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ ఉదయం నిర్వహించిన అభిషేక సేవలో జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వేర్వేరుగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రాలతో సత్కరించారు.

---------------------------

అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు అగ్నిమాపకశాఖ అధికారి చంద్రమౌళి సూచించారు. ప్రకాశం జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం చంద్రమౌళి మాట్లాడుతూ, వేసవి కాలంలో జనసమ్మర్ధ ప్రదేశాల్లో అగ్నిప్రమాదాలు నివారించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా తలసేమియా వ్యాధి అవగాహన దినాన్ని ఈరోజు పాటిస్తున్నారు. తల్లిదండ్రుల్లోని జన్యుపరమైన లోపాల వల్ల పిల్లల్లో కలిగే రక్తహీనత వ్యాధినే తలసేమియా అంటారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల్లో రక్తహీనతను ఎదుర్కోవడం ప్రధాన సమస్య. తలసేమియా వ్యాధిపై ప్రజలలో అవగాహన పెంచడం, బాధితులకు మద్దతు ఇవ్వడం, ఈ జన్యుపరమైన రుగ్మతకు నివారణ చర్యలను ప్రోత్సహించడం వంటి

అంశాల పట్ల అవగాహన కల్పించేందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఈరోజు తలసేమియా నివారణ దినంగా పాటిస్తున్నారు.

---------------------------

గిరిజన ప్రాంతాల్లో రెడ్ క్రాస్ సంస్థ వైద్య సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తోందని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం జి.ముంచింగిపుట్టు గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామాల్లో వైద్యసేవలు అందించేందుకు 'మీ ఇంటికి మీ డాక్టర్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తూ

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.వి.మురళీకృష్ణ తెలిపారు. శ్రీకాకుళంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, ఈ ఏడాది ఖరీఫ్ లో జిల్లాలో లక్షా 76 వేల హెక్టార్లలో వరి సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వరితో పాటు ఇతర పంటలను మరో 25 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కొనుగోలుకు 4 కోట్ల 84 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. అలాగే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా జిల్లాలోని గ్రామాల్లో రైతులకు యూరియా వినియోగం, ఆధునిక సాగు పద్ధతులు, అధిక దిగుబడులు ఇచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---------------------------

కృష్ణాజిల్లా, అవనిగడ్డ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నిన్న ప్రారంభించారు. పెదకళ్లేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే 91 లక్షల రూపాయల వ్యయంతో మోపిదేవి నుంచి వెంకటాపురం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, ఎంపీ లాడ్స్ నిధుల నుంచి కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించారు. అనంతరం బాలశౌరి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు కోల్‌కతా పర్యటనకు వెళ్లనున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ను అధికారులు విడుదల చేశారు.

=====================